
# పతిదేవుడూ - పాలబూతూ

బెహరా వెంకట సుబ్బారావు



ఈ మధ్య నాకో కష్టం వచ్చింది. ఒక రితో చెప్తుకుంటే తీరేది కాదు. ఎందుకంటే ఎవరూ. ఆర్చలేరు – తీర్చలేరు కాబట్టి. అనుభవించక తప్పదు. పట్నంలో నివసించేవాడు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు అనేవాడు మా మేనమావ. అతనిప్పుడు లేడు (చచ్చి) స్వర్గాన వున్నాడు. కొన్ని కష్టాలు తెల్లవారేసరికే మొదలవుతాయి. తెల్లవారేసరికి కాఫీ కావాలి కదా! ఆ కాఫీకి పాలుండాలి! పాలకోసం తెల్లవారకుండానే లేచి పాలబూతుకెళ్లి క్యూలో నిలబడాలి. ఈ రకం కష్టంనుండి తప్పించుకొందుకే ఓ మనిషిని కుదుర్చుకొన్నాం. ఒక్కో పేకట్‌కి నెలకీ ఆరురూపాయలు పారేస్తే ఉదయం రెండు పాకెట్లూ సాయంత్రం రెండు పాకెట్లూ తెస్తుందామె. అంటే ఆమెకి నెలకి పాతిక రూపాయిలు. పోతే పోయాయ్ పాతిక! ఉదయం ఏడుగంటలవరకూ – "కాఫీ రెడీ" అని అర్ధాంగి దుప్పటిలాగి చెప్పేవరకూ హాయిగా రెండో తలగడాని కావలించుకొని పడుకోవచ్చు. ఏమంటారు? మీరు కాదనరని నాకు తెలుసు! డిసెంబరు నెలలో. చలెక్కువ. ఆ నెల్లోనే వచ్చింది నాక్కష్టం!

పాలు పేకట్లు తెచ్చే పాపాయమ్మ నాలుగు రోజులు శలవు పెట్టింది. తన అన్నయ్య కొడుకి పెళ్లికి అనకాపల్లి వెళ్లింది. అంచేత ఆ పాల డ్యూటీ నాకు పడింది. తెల్లవారురఝామున నాలుగున్నరకల్లా అలారం పెట్టుకొని లేపుతుంది అర్ధాంగి. అనూరాధ. చలిలో లేచి వెళ్లడానికి ఇబ్బందే అయినా తప్పదు. పాలకేంద్రం మా ఇంటికి పెద్ద దూరం లేదు. సెంట్రల్ బేంక్‌కి ఎదురుగా మూడు లాంతర్ల జంక్షన్‌కి దగ్గరగా వుంది. ఆ పాల వేన్ విశాఖపట్నంనుంచి రావాలి. ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలీదు. కానీ నాలుగున్నరా – ఆరుగంటల మధ్య వస్తుందని అందరికీ తెలుసు. ఏడూ–ఏడున్నరకీ వచ్చిన రోజులూ వున్నాయ్. అది వచ్చినప్పుడు మనం రెడీగా వుండాలి. ఆలస్యం అయితే అంతే సంగతులు! ఇతర బూతుల దగ్గరకి పరుగులు తీయాలి. అక్కడయినా దొరుకుతాయని గ్యారంటీ లేదు. పాలకేంద్రం దగ్గర మనలాంటి వాళ్లెందరో వుంటారు. కాలక్షేపానికి కొదువలేదు.

మా పిన్నత్తగారి కొడుకు ప్రభాకర్ కూడా వస్తున్నాడీ మధ్య. అతను మంచిమాటకారి. కులసావు రుషుడు! నన్ను చూడగానే (బావగారిని కదూ!) ఆప్యాయంగా పలకరిస్తాడు.

న్యూస్ పేపరు వచ్చే సమయం కాబట్టి మూడు లాంతర్ల జంక్షన్‌కి పోతాం. పేపరు కొంటాడు. తర్వాత కాఫీ తాగుదాం అంటాడు. కాఫీ తాగిస్తాడు "బెడ్‌కాఫీ!" తర్వాత పేపరుని తలో పార్టునీ తీసుకొని చదవడం ప్రారంభిస్తాం. సిగరెట్ ముట్టించి పేపరు విప్పతాడు ప్రభాకర్ చలి పోవడానికి. పేపరు పఠనం అవుతుంది. అప్పటికీ

పాల వేన్ రాకపోతే మరో సిగరెట్ వెలిగిస్తాడు ప్రభాకర్. ఆ రోజు పాలవేన్ ఆలస్యంగా అంటే ఏడు గంటలకి, ప్రభాకర్ నాలుగో సిగరెట్ తగలే శాక వచ్చింది. మరోసారి కాఫీ తాగాంకూడా.

పాలపేకట్లు అర్ధాంగికందిస్తూ విసుక్కొన్నా. "రోజూ వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా వుంది" అని "పాపాయమ్మ ఈ రోజు వచ్చేస్తుంది లెండి! రేపట్నుంచీ వెళ్లక్కర్లేదు!" సముదాయించింది అనూరాధ.

తర్వాత నేను చల్లబడ్డాక వేడి కాఫీ అందిస్తూ అంది. "నాలుగు రోజులకే చికాకు పడిపోతున్నారు! చక్కా మా పిన్ని కొడుకు చూడండి! రోజూ వెళ్లి తెచ్చుకొంటున్నాడు. పాపాయమ్మని మాన్పించేసింది మా వదిన! నెలకి పాతిక రూపాయిలు మిగుల్తాయని!"

అనూరాధ ఆఖరి మాటలు నాకాశ్చర్యాన్ని కల్గించాయ్!

"నెలకి పాతిక అంటే రోజుకెంత మిగుల్తుంది!" అడిగా.

"ఏమో! మీరే లెక్క చెప్పండి!" అంది విసుగ్గా.

"డెబ్బై పైసలు" అన్నా.

"అలా లెక్కలు కడ్తోంది కాబట్టే నెలకి అయిదువందలు చీటీ కడ్తోంది మా వదిన! దానికీ పిల్లలకీ మెడలో ఎంత బంగారం వుందో చూశారుగా! మీరూ వున్నారెందుకు! పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్టు యాభై రూపాయిలూ నెలనెలా కట్టలేకపోతున్నారు. బాకీలతో కడ్తున్నారు! పిల్లలున్నారు వెనకేసుకోవాలన్న జ్ఞానం లేదు! అయినా మీ జీతం వచ్చేపోయే చుట్టాలకే సరిపోతుంది! చుట్టాలొచ్చే ఇల్లూ దొంగలు పడ్డిల్లూ ఎత్తిరిల్లదని వూరికినే అనలేదు!"

వాళ్ల ఒదిన పొదుపరితనాన్ని మెచ్చుకుంటూ నా సంసారాన్ని ఎండగట్టింది. నాలో కాస్త పౌరుషం వచ్చింది.

"మీ అన్నయ్యకి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వుద్యోగం! మీ ఒదిన తలచుకొంటే నెలకేం కర్మ! రోజుకే అయిదువందలు చొప్పన చీటీ కట్టగలదు! మొగుడు రెండు చేతులకీ వున్న పదివేళ్లతోనూ సంపాయిస్తున్నాడు. సంపాదన వస్తూన్న కొద్ది ఆమెకి పిసినారితనం ఎక్కువవుతోంది. మొగుడ్ని పాలకి పంపితే పాతిక రూపాయలు మిగుల్తాయనుకొంది. పనిమనిషిని కూడా మాన్పించేయమను! కానీ ఆ పని చేయదే! తనకి కష్టం వుండకూడదు. మొగుడు మాత్రం చలిలో పోయి పాలకోసం పాట్లు పడాలి!" అని ఆగి ఆమె మొహంలోకి చూశా. అనూరాధ మాట్లాడలేదు. మళ్లీ చెప్పడం మొదలుపెట్టాను.

"మీ ఒదిన తాను పొదుపు చేస్తోందని మురిసిపోతోంది కాబోలు! పాలబూత్ దగ్గర పతిదేవుని 'ఖర్చు' తెలిస్తే తెలివితప్పి దభాల్న పడిపోతుంది. తెప్పరిల్లిన తర్వాత పాలకోసం పాపాయమ్మ దగ్గరకి పరుగెడ్తుంది!"

"పాల బూతు దగ్గర ఖర్చేముంటుందండి! బ్లాకులో కొంటారా? లేక లంచం ఇస్తారా?" ఆశ్చర్యంగా అమాయకంగా అడిగింది.

అక్కడే జరిగే వ్యవహారం వివరంగా చెప్పి, 'రోజూ ఉదయం పూట అతని ఏవరేజ్ ఖర్చు మూడు రూపాయల"ని చెప్పా.

"అయితే మీరూ అక్కడ రోజూ కాఫీ తాగుతున్నారా?" కాస్త కోపం మిళితం చేసి అనుమానంగా అడిగింది.

"ఆ తాగుతున్నా!" చెప్పా.


"అలా అయితే నేనే వెళ్లేదాన్ని కదండి!" అంది.

"నువ్వేం బాధపడకు! నా కాఫీల ఖర్చుకూడా మీ అన్నయ్యే పెట్టుకొనేవాడు. బావగారిని కదూ! పైగా నాలుగు రోజులు గెస్టువి! ఈ సంగతి మీ ఒదినకి చెప్పకు సుమా!" హెచ్చరించాను.

"అయినా పాలకింక మిమ్మల్ని పంపకూడదు!" అంటూ కాళీ గ్లాసు తీసుకొని వంటింట్లోకి వెళ్లింది.

◆

## రిపోర్టర్ డైరీ లోంచి...



ఘటనల్ని అక్షరాల్లోకి స్వాగతిస్తూ
అవి ఆవాహన అయ్యాక
యంత్ర భూతాలకిస్తే-
నల్ల పావురాల్ని చేసి
ఇలా తలంపై యెగరేస్తున్నాయ్
ఒక పావురం ఒకో యింటి ప్రాంగణంలోకి
ఉదయంతో ఆగమిస్తుంది;
పావురాయి ప్రతి ఈకపై
నలుపు రాతలు!
మస్తిష్కం లోని పిచ్చుకలు
అక్షరాల గింజల్ని ఆబగా పొట్టనింపుకుంటాయి;
నిన్న రాత్రి మేనేజిమెంట్ వద్దకు
కార్మికుల పక్షాన చర్చలకు బయల్దేరిన
కార్మిక నాయకుణ్ణి నాటు బాంబులతో చౌరాస్తాలో
ప్రేల్చేస్తే-
ఆ హత్యని కలం గళమెత్తి చెప్పాలనుకున్నప్పుడు
రిపోర్టర్ టేబుల్ మీది ఫోను చిర్రెత్తి అరిస్తే-
రిసీవర్ చెవికి చేర్తే-
ఘటన ఎలా మార్పులతో ముస్తాబు చేయాల్నో
ఆదేశం అందింది-
అదే రాసింది కలం!
నల్ల పావురం అదే సందేశాన్ని
నలు దిశలా చాటింపేసింది!
మనసుకు మరోమారు గాయమై
వుండ చుట్టుకుంది...

— శశిశ్రీ